# ఎన్నికల వ్యవస్థ - ఎన్నికల కమిషన్ స్వతంత్రత

**ఎన్నికల** కమిషన్ రాజ్యాంగ చట్ర పరిధిలో పనిచేసే వ్యవస్థ. ఎన్నికల కమిషన్. ఇది ఏ రాజకీయ పార్టీ ప్రయోజనాలను, అవసరాలను పరిపూర్తి చేసే వ్యవస్థ కాదు. నిష్పక్షపాతంగా, ప్రజాస్వామ్యయుతంగా పనిచేసి తీరాల్సిన వ్యవస్థ ఇది. ఈ మధ్య కాలంలో ఛీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సిఇసి), ఎలక్షన్ కమీషనర్ (ఇసి)ల నియామకాలు పారదర్శకంగా జరుగుతున్నాయా లేదా అనే చర్చలు జరుగుతున్నాయి.

ఒకవైపున, సిఇసి, ఇసిల నియామక క్రమాల గురించిన ఫిర్యాదులపై న్యాయస్థానంలో వారం రోజులుగా వాదోపవాదాలు జరుగుతూండగానే, డిసెంబర్ 31వ తేదీన పదవీ విరమణ చేస్తోన్న పంజాబ్ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి, భారీ పరిశ్రమల మంత్రిత్వశాఖలో కార్యదర్శిగా పనిచేస్తున్న అరుణ్ గోయెల్‌ను స్వచ్ఛంద పదవీ విరమణ చేయించి, ఆయనను అదేరోజు సిఇసిగా నియమించారు. అరుణ్ గోయల్ కేంద్ర ప్రభుత్వంలోని పలు శాఖలలో దశాబ్దాల కాలంపైగా పనిచేస్తూ, 2014లో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత నమ్మకంగా 'తలాడించే మనిషి'గా అనేక పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రత్యేకించి మనదేశానికి స్వాతంత్ర్యం సంప్రాప్తించి 75 సం॥లు పూర్తయిన సందర్భంగా 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్' కార్యక్రమ రూపకల్పనలోనూ, దానికి విస్తృత ప్రచారం కల్పించటంలోనూ ఆయన ఒక కీలక పాత్ర నిర్వహించారు.

ఈ సందర్భంలో "ఎలక్షన్ కమిషన్‌లో సంస్కరణలు చేపట్టాల్సిన సమయం ఆసన్నమైంది. మొదటగా ప్రధాని, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రతిపక్ష నేతలతో కూడిన 'కొలీజియమ్', ఎన్నికల కమీషన్‌ను ఎంపిక చేయాలి; ఎన్నికల కమీషనర్లు ప్రభుత్వానికి 'తలాడించేవారు'గా వుంటే, ఎన్నికల కమీషన్ స్వతంత్రంగా వుండలేదు; ప్రధాని హోదాలోనున్న వ్యక్తిపై ఎన్నికల సందర్భంగా ఏవైనా ఆరోపణలు ముందుకువస్తే, ఎన్నికల కమీషన్ ప్రధానిపై చర్య తీసుకోకుండా తప్పించు కోరాదు" అనే సుప్రీంకోర్టు వ్యాఖ్యానం, తీవ్రమైన చర్చలకు దారితీసింది.

1947 తదనంతర కాలంలో, మనదేశ ఎన్నికల కమీషన్ పనితీరును గమనిస్తే, 1952లో సాధారణ ఎన్నికలు నిర్వహించిన నాటి నుండి, అది ఏనాడూ స్వతంత్రంగా వ్యవహరించకపోగా, పాలక కూటమికి అనుగుణంగా 'తలాడిస్తూ' సేవ చేస్తోంది.

ఓటర్లయిన పేద, దళితులను, పీడిత ప్రజానీకాన్ని వారి వారి ఇళ్ళలోనే నిర్బంధించి, వారిని దుర్మార్గంగా పశువుల కొట్టాల్లో కట్టిపడేసి, వారిని పోలింగ్ బూత్‌లకే వెళ్ళనీయకుండా నిరోధించారు. వారిని ఓటువేయనిస్తే, వారంతా కమ్యూనిస్టులకే ఓటు వేస్తారని భావించి ఈ దౌర్జన్యానికి ఒడిగట్టారు; కమ్యూనిస్టులు ఎన్నికలలో విజయం సాధించినచోట మోసకారీతనంగా ఫలితాలను తారుమారు చేశారు; కమ్యూనిస్టు అగ్రనాయకులు అభ్యర్థులుగా పోటీచేసినచోట రిగ్గింగ్, మద్యం పంపిణీ, డబ్బు పంపిణీ మొదలైన వానితోపాటు ప్రభుత్వాధికారాన్ని వినియోగించి భయోత్పాతాన్ని సృష్టించటం వంటివి పాలకపార్టీలు అనుసరించిన పద్ధతుల్లో కొన్ని మాత్రమే. ఈ సందర్భాలన్నింటిలోనూ ఎన్నికల కమిషన్, పాలకపార్టీల ప్రయోజనాల పక్షానే నిలిచింది. మొట్టమొదటి ప్రధాని జవహర్‌లాల్ మొదలుకొని నేటి ప్రధాని మోడీ వరకూ ఈ ప్రహసనం కొనసాగుతూనే వుంది. అయితే, 1990-96 సం॥ల నడుమ ప్రధాన ఎన్నికల కమీషనర్‌గా పనిచేసిన టి.ఎన్.శేషన్ దీనికి ఒక మినహాయింపు. ఎన్నికల వ్యవస్థపై ప్రజాస్వామిక వాదులకు సైతం భ్రమలు తొలగుతున్న నేపథ్యంలో ఎన్నికలను నిష్పక్షపాతంగా జరిపేందుకు, ప్రజాస్వామ్య చట్రంలో ఎన్నికలలో ప్రజలంతా ఓటు హక్కును వినియోగించుకునేలా చేసేందుకు ఆయన ప్రయత్నించాడు. అయితే, అది కొనసాగలేదు.

ఇప్పుడు, సుప్రీంకోర్టు చేసిన 'ప్రజానుకూల' అనే వ్యాఖ్యలను పరిశీలిద్దాం. ఇటీవల తెలంగాణా రాష్ట్రం - మునుగోడులో జరిగిన ఉప ఎన్నిక సందర్భంగా డబ్బు ఖర్చు చేసిన పద్ధతిలోనే గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికలలోనూ అదే విధానం కొనసాగుతోంది. 2024 సం॥లో జరగనున్న దేశవ్యాప్త సాధారణ ఎన్నికలు - కులం, మతం కేంద్రాలుగా సమీకరణలు జరగని విధంగా, డబ్బు, మద్యం పంపిణీ వుండని భిన్నమైన విధానంలో నిష్పక్షపాతంగా, నిజాయితీగా జరగబోతున్నాయా? సుప్రీంకోర్టు ఎత్తిచూపిన అంశాలు ఆచరణలోకి రానున్నాయా? ఆవిధంగా జరిగితే ఏ ప్రజాస్వామికవాది అయినా సంతోషిస్తాడు.

ఆధిపత్య పాలన దోపిడీవర్గాలను పరిరక్షిస్తుంది; అది నిరంతరాయంగా శ్రామికవర్గాన్ని, పేదలను, మధ్యతరగతి రైతాంగాన్ని దోపిడీ చేస్తుంది. కులంపై ఆధారపడిన వివక్షను, మతతత్వాలను పెంచి పోషిస్తుంది. న్యాయమైన హక్కుల కోసం జరిగే పోరాటాలను, ఆందోళనలను అది అణచివేస్తుంది. సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకనుగుణంగా అది వ్యవహరిస్తుంది. ప్రజలలో కులం, మతం, భాషా విషయాలపై ఆధారపడి విభజనలను అది సృష్టిస్తుంది. కిరాయి మూకలను పయోగించి ప్రగతిశీల శక్తులపై అది దాడులు చేయిస్తుంది. అణచివేత అధికార యంత్రాంగాన్ని వినియోగించి విప్లవ శక్తులను నిర్బంధిస్తుంది. దోపిడీవర్గాల పాలనను మరింతకాలం

కొనసాగించేందుకు ప్రభుత్వం ఫాసిజాన్ని ఒక సాధనంగా వినియోగించుకుంటుందని ఇదంతా మనకు తెలుపుతోంది. అనేక సందర్భాలలో ఎన్నికల వ్యవస్థ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని రుజువైంది. నిజమైన ప్రజాస్వామ్య సాధన కోసం ప్రజలను చైతన్యయుతులను చేసే కర్తవ్యం వామపక్ష, విప్లవ శక్తులపై వుంది.

*****